సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం । 26 । నవంబర్ । 2023



సభను జయప్రదం చేయాలి
రాయగిరిలో అమిత్‌షా బహిరంగ సభను జయప్రదం చేయాలని గూడూరు నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. - 6లో



పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా..
పెళ్లి బృందం బస్సు అదుపుతప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. - 6లో



చండీ యాగం
యాదాద్రిలో శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో చండీ యాగం మూడవ రోజూ కొనసాగింది.

న్యూస్‌రీల్

యాదాద్రిలో గజవాహన సేవ



గజవాహన సేవను ఊరేగిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శనివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి.వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు.. శ్రీస్వామి, అమ్మ వార్లకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులకు నిజాభిషేకం చేసి తులసీ దళాలతో అర్చించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం జోడు సేవలను మాఢవీధిలో ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి జయరాజు

భువనగిరి క్రైం : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు పేర్కొన్నారు. జాతీయ న్యాయ దినోత్సవం, సంవిదాన్ దివాస్‌ను పురస్కరించుకొని శనివారం కోర్టు ఆవరణలో ×న్యాయ చైతన్య సదస్సు– ఆర్టికిల్ 39ఎపై నిర్వహించిన చర్చాగోష్టిలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంచి నాగరిక సమాజం ఏర్పడాలంటే చట్టాలను గౌరవించాలన్నారు. న్యాయసేవలు మరింత చేరువయ్యాయని, నిరుపేదల ఉచిత న్యాయ సహకారం పొందవచ్చన్నారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య మాట్లాడుతూ న్యాయ సేవలను విస్తృత పరుస్తూ అర్హులందరికీ ఉచిత న్యాయ సహకారం అందజేస్తున్నామని చెప్పారు. ప్రధాన జూని యర్ సివిల్ జడ్జి నాగేశ్వర్‌రావు, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగారం అంజయ్య, ఏజీపీ కేశవరెడ్డి, న్యాయవాదులు జైపాల్, శంకర్, రాజిరెడ్డి, రాంరెడ్డి, లింగయ్య, హరికృష్ణగౌడ్, సిద్ధిరాములు, వయో వృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ సభ్యులు బాలేశ్వర్ పాల్గొన్నారు.

డిసెంబర్ 30న లోక్ అదాలత్

భువనగిరి క్రైం : రాజీపడదగిన కేసుల పరిష్కారం కోసం డిసెంబర్ 30 తేదీన లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జయరాజు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి దశరథరామయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు లోక్‌అదాలత్ ఉంటుందన్నారు. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వలస ఓటర్లే నిర్ణేతలు!

ఎనిమిది నియోజకవర్గాల్లో వారి ప్రభావం

- ఉమ్మడి జిల్లాలో 1.70 లక్షల మందికి పైగా వలస ఓటర్లు
- స్వస్థలాల్లో ఓటేసేందుకు రప్పిస్తున్న నాయకులు
- కొన్నిచోట్ల రవాణా సదుపాయం కల్పించేలా ఏర్పాట్లు
- మరికొన్ని చోట్ల రాను పోను ఖర్చులు, ఓటుకు ఇంత ఇస్తామంటూ బేరసారాలు
- హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉంటున్న వారితో ప్రత్యేక సమావేశాలు



ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాల వారీగా మొత్తం ఓటర్లు, వలస ఓటర్లు (అంచనా)

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	వలస ఓటర్లు
నల్లగొండ	2,44,560	9,500
నకిరేకల్	2,50,547	15,000
మునుగోడు	2,52,648	25,000
దేవరకొండ	2,51,622	20,000
నాగార్జునసాగర్	2,33,412	12,000
మిర్యాలగూడ	2,31,391	2,000
సూర్యాపేట	2,41,799	14,000
తుంగతుర్తి	2,55,017	25,000
హుజూర్‌నగర్	2,42,711	6,000
కోదాడ	2,41,554	6,400
ఆలేరు	2,33,266	30,000
భువనగిరి	2,16,941	6,000

2018 అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడలో బీఆర్‌ఎస్ అభ్యర్థి బొల్లం మల్లయ్య యాదవ్‌కు 89,115 ఓట్లు లభించగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎన్.పద్మావతిరెడ్డికి 88,359 ఓట్లు వచ్చాయి. కేవలం 756 ఓట్ల తేడాతో ఆమె ఓడిపోయారు. తుంగతుర్తిలోనూ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్ కుమార్‌కు 90857 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి అద్దంకి దయాకర్‌కు 89,010 ఓట్లు లభించాయి. తేడా 1847 ఓట్లు మాత్రమే. అభ్యర్థుల గెలుపోటములకు మధ్య తేడా ఒక్క ఓటు చాలు. ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమే. అందుకే ప్రతి ఓటు పొందేలా పార్టీలు ప్రణాళికతో పనిచేస్తున్నాయి. ఇందులో భాగంగా వలస ఓటర్లపైనా ప్రత్యేక దృష్టి సారించాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలు వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డాయి. – సాక్షి ప్రతినిధి, నల్లగొండ

ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాలకు గాను 8 నియోజకవర్గాల్లో వలస ఓటర్లే అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నల్లగొండ, నకిరేకల్, మునుగోడు, దేవరకొండ, నాగార్జునసాగర్, సూర్యాపేట, తుంగతుర్తి, ఆలేరు నియోజకవర్గాల్లో భారీ సంఖ్యలో వలస ఓటర్లు ఉన్నారు. ఇక మిగతా నియోజకవర్గాల్లోనూ వలస ఓటర్ల సంఖ్య అధికంగానే ఉంది. ఈ నేపథ్యంలో ఈసారి పార్టీలు వారిపై ప్రత్యేక దృష్టి సారించాయి. వారిని ప్రసన్నం చేసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి.

ఆకట్టుకునేందుకు తాయిలాల ఆశ

వలస ఓటర్లను ఆకట్టుకునేందుకు రాజకీయ పార్టీలు తాయిలాలను ఆశగా చూపుతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు వలస ఓటర్లు ఎక్కడెక్కడున్నారో తెలుసుకొని మరీ, వారితో సంప్రదింపులు జరుపుతున్నారు. నియోజకవర్గానికి చెందిన ఓటర్లు కొందరు ఉద్యోగ రీత్యా, మరికొందరు పిల్లల చదువుల కోసం, ఇంకొందరు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం, పేద కుటుంబాలకు చెందిన అనేక మంది కూలి పనులకోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి నివసిస్తున్నారు. వారి ఓట్లు మాత్రం స్థానికంగానే ఉన్నాయి. దీంతో వారిని పోలింగ్ రోజున రప్పించే ఏర్పాట్లలో పార్టీల నేతలు నిమగ్నమయ్యారు. వలస వెళ్లిన ఓటర్ల బంధువుల ఇళ్లకు వెళ్లి వారి ఫోన్ నంబర్లు, అడ్రస్‌లు తీసుకుని వారితో మాట్లాడుతున్నారు. చుట్టు పక్కల ఇంటి వారి నుంచి కూడా వలస ఓటర్ల సమాచారం తీసుకుని మాట్లాడుతున్నారు. పట్టణాల్లోని వార్డు ఇన్‌చార్జీలు, మండల, గ్రామ ఇన్‌చార్జీలు, పార్టీల నేతలు వలస ఓటర్లతో సంప్రదింపులు జరుపడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్ పరిసరాల్లో ఉంటున్న వారికి కారు వంటి వాహన సదుపాయం కల్పిస్తామని, ముంబై, చెన్నై, సూరత్, భీవండి, ఇతర రాష్ట్రాలు, దూర ప్రాంతాల్లో ఉంటున్న వారికి రానుపోనూ రవాణా ఖర్చులు, కానుకలు ఇవ్వడంతోపాటు ఓటుకు ఇంత ఇస్తామంటూ వల వేస్తున్నారు.

ప్రత్యేక సమావేశాలపై దృష్టి

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య ప్రధాన పోటీ ఉండటం, కొన్ని నియోజకవర్గాల్లో బీజేపీ కూడా పట్టుకోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో గెలుపోటముల్లో వలస ఓటర్లు కీలకంగా మారే అవకాశం ఉంది. అందుకే అన్ని పార్టీల అభ్యర్థులు వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డాయి. హైదరాబాద్ పరిసరాల్లో పెద్దఅంబర్‌పేట్, హయత్‌నగర్, కుంట్లూరు, బీఎన్‌రెడ్డి నగర్, వనస్థలిపురం ఎల్బీనగర్, ఉప్పల్, బోడుప్పల్, నారపల్లి, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్ తదితర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టిన రాజకీయ పార్టీలు వారిని ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నాయి. వారితో ప్రత్యేక సమావేశాలకు తెరతీశాయి. ఇటీవల మునుగోడు నియోజకవర్గానికి చెందిన బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి హైదరాబాద్ వనస్థలిపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. మిగతా పార్టీల అభ్యర్థులు కూడా వలస ఓటర్లతో సమావేశాల నిర్వహణపై దృష్టి సారించారు.

బీజేపీతోనే అభివృద్ధి

- గత పాలకులు మునుగోడును పట్టించుకోలేదు
- చౌటుప్పల్ రోడ్ ‌షోలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా
- చలమల్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని ప్రజలకు పిలుపు



చౌటుప్పల్‌లో నిర్వహించిన రోడ్ ‌షోకు హాజరైన బీజేపీ కార్యకర్తలు, ప్రజలు



రోడ్ ‌షోలో మాట్లాడుతున్న అమిత్ ‌షా, పక్కన అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి

చౌటుప్పల్ : వెనుకబాటుకు గురైన మునుగోడు నియోజకవర్గం ప్రగతిపథంలో పయనించాలంటే బీజేపీతోనే సాధ్యమని, అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పువ్వుకు ఓటు వేసి గెలిపించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. మునుగోడు బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డికి మద్దతుగా శనివారం చౌటుప్పల్‌లో నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గత పాలకులు మునుగోడును పట్టించుకోలేదని, నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి చలమల్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడబోతుందన్నారు. కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ సర్కార్ ఉంటే నియోజకవర్గం కూడా అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. ఓ వైపు రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వం ఉందని, మరోవైపు అమ్ముడుపోయే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారని, ఈ విషయాన్ని గమనించి ప్రజలంతా బీజేపీకి అండగా నిలవాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకు అయోధ్యలోని రామమందిర దర్శనం ఉచితంగా కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. వచ్చే ఏడాది జనవరి 22న రామమందిరాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభిస్తారని తెలిపారు.



interview

'పదేళ్ల పాలనా కాలంలో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశా. గోదావరి జలాలతో 90 శాతం బీడు భూములను సాగులోకి తెచ్చా. యాదగిరిగుట్టకు మెడికల్ కళాశాల తీసుకువచ్చాం. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అద్భుతంగా పునర్నిర్మాణం చేశాం. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో ఇవన్నీ పూర్తి చేశాం. కాంగ్రెస్‌ది అధికార ఆకాంక్ష.. ప్రజలకు మంచి చేయాలన్న చిత్తశుద్ధే లేదు. ప్రజల మద్దతు బీఆర్‌ఎస్‌కే ఉంది. మూడవసారి గెలుపు ఖాయం' అని ధీమా వ్యక్తం చేశారు.. ఆలేరు నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి. శనివారం ఆమె 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

–సాక్షి, యాదాద్రి

మాటపై నిలబడ్డాం

హామీలన్నీ నెరవేర్చాం.. మళ్లీ గెలుస్తాం

- కాంగ్రెస్‌ది అధికార ఆకాంక్ష.. ప్రజలకు మంచి చేయాలన్న చిత్తశుద్ధే లేదు
- నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశాం
- గోదావరి జలాలతో బీడు భూములు సాగులోకి తెచ్చాం
- గుట్టకు మెడికల్ కళాశాల తీసుకువచ్చాం
- ఇంకా చేయాల్సింది ఉంది
- ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా 50 వేల మెజార్టీతో విజయం సాధిస్తా

- ఆలేరు బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ ప్రారంభించిన ఉద్యమంలో ఆలేరు నియోజకవర్గంలో 2001 నుంచి ప్రత్యక్షంగా పాల్గొన్నా. ఉద్యమంలో ఒక వైపు, ప్రజాప్రతినిధిగా మరోవైపు ప్రస్థానం కొనసాగించాను. సర్పంచ్‌గా, ఎంపీపీగా పని చేశాను. కేసీఆర్ అండదండలతో 2014లో ఆలేరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా తొలిసారి విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టాను. నా భర్త మహేందర్‌రెడ్డి సహకారంతో ప్రజాజీవితంలో విజయవంతంగా ముందుకెళ్తున్నా. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా మూడవసారి 50 వేల మెజార్టీతో విజయం సాధిస్తా. ఓటమి భయంతో కాంగ్రెస్ నాయకులు ఎక్కడికక్కడ రభస సృష్టిస్తున్నారు. రోజు కూలి ఇచ్చి బీఆర్‌ఎస్‌పై దుష్ప్రచారం చేయిస్తున్నారు. వారిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు.

నియోజకవర్గం గొప్పగా ఉండాలన్నదే నా లక్ష్యం

నియోజకవర్గం గొప్పగా ఉండాలన్నది నా తపన. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది తన లక్ష్యం. పరిశ్రమల ఏర్పాటుకు తుర్కపల్లి మండల కేంద్రంలో 138 ఎకరాల్లో భూసేకరణ చేశాం. ఎన్నికల తర్వాత గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. మహిళలకు నైపుణ్యాభివృద్ధికోసం ఆలేరులో ప్రాంగణం ఏర్పాటు చేశాం. రాజాపేటలో ఒకేషనల్ కళాశాల ఏర్పాటు చేస్తాం. అందుకు భవనం కూడా సిద్ధంగా ఉంది. యాదాద్రి తరహాలో కొలనుపాక సోమేశ్వరాలయాన్ని పునర్‌నిర్మిస్తాం. రహదారులను పునర్నిర్మించాలి. బొమ్మలరామారం, తుర్కపల్లి, యాదగిరిగుట్టలోని జూనియర్ కాలేజీలను డిగ్రీ కాలేజీగా మార్చాలని ఆలోచిస్తున్నాం. ఆత్మకూరు, గుండాల మండలాలకు జూనియర్ కాలేజీలు తీసుకువస్తా. ప్రజలు మరోసారి నాకు అవకాశమిచ్చి 50 వేల మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నా.

కేసీఆర్ ఆశీర్వాదంతో అభివృద్ధి చేశా

జనగామ జిల్లాలో ఉన్న గుండాల మండలాన్ని యాదాద్రి భువనగిరిలో విలీనం చేశాం. పోలీస్ శాఖను కూడా వరంగల్ కమిషనరేట్ నుంచి రాచకొండ కమిషనరేట్‌లో కలిపాం. దీంతో వరంగల్‌లో విధులు నిర్వహించాల్సిన గుండాల పోలీసులు ఇప్పుడు రాచకొండలో పనిచేసే అవకాశం లభించింది. యాదాద్రి ఆలయ అభివృద్ధి, మెడికల్ కళాశాల, 100 పడకల ఆస్పత్రి ఇలా మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టా. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో ఇవన్ని చేయగలిగాను.

నిరుద్యోగులకు చేయూతనిచ్చా..

ఆలేరు నియోజకవర్గంలో ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న సుమారు 1,050 మంది నిరుద్యోగులకు ఉచితంగా కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేశా. అంతేకాకుండా 500 మంది విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశా. పోలీసు ఉద్యోగాలకు శిక్షణ పొందిన వారిలో 12 మంది కానిస్టేబుల్స్‌గా, ఒకరు ఎస్‌ఐగా సెలక్ట్ అయ్యారు. వారు నన్ను కలవడానికి వచ్చినప్పుడు చాలా సంతోషపడ్డా.

మరోసారి గెలిపిస్తే పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తా

గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాను. మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులు, కుంటలకు పూర్వవైభవం తీసుకువచ్చాం. చెక్ డ్యాంలు కూడా నిర్మించాం. గోదావరి జలాలను తీసుకువచ్చాం. దాదాపు 90 శాతం బీడు భూములు సస్యశ్యామలమం అయ్యాయి. వీటితో పాటు రోడ్లు, ఇతర మౌళిక సదుపాయాలు కల్పించా. ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి.. అవి కూడా పూర్తి చేస్తా. అందుకే మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ప్రజలను కోరుతున్నా. ప్రతి శనివారం ఆలేరులోని నా క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నాం. ప్రజల సమస్యలు తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నా.

ఈవీఎంలపై అవగాహన ఉండాలి



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

పోలింగ్ కేంద్రం పరిశీలన

వలిగొండ, సంగెం, గోకారం, భూదాన్‌పోచంపల్లి, కప్రాయిపల్లి గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను శనివారం పోలీసు పరిశీలకుడు విపుల్‌కుమార్ పరిశీలించారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు వలిగొండ, భూదాన్‌పోచంపల్లి పోలీసు స్టేషన్లను సందర్శించి ఆయా మండలాల్లో పరిస్థితులపై ఆరా తీశారు.

సాక్షి, యాదాద్రి : పోలింగ్ నిర్వహణలో పాల్గొనే సిబ్బంది ఈవీఎంలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే సూచించారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు మూడు రోజులుగా ఇస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై పలు సూచనలు చేశారు. 29న డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో చెక్‌లిస్టు ప్రకారం పోలింగ్ మెటీరియల్ తీసుకొని సరిచూసుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌లకు చేరుకున్న తరువాత పోలింగ్ ఏజెంట్లకు గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు వారికి పోలింగ్ నిబంధనలు తెలియజేయాలన్నారు. పోలింగ్‌కు 90 నిమిషాల ముందు ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోల్ నిర్వహించాలని, ఆ తర్వాత అసలు పోలింగ్‌కు సిద్ధం కావాలని సూచించారు. అభ్యర్థికి ఒక పోలింగ్ ఏజెంట్‌ను మాత్రమే అనుమతించాలని, పోలింగ్ సరళిని ప్రిసైడింగ్ అధికారులు ఎప్పటికప్పుడు తన డైరీలో నమోదు చేసుకొని ఎన్నికల అధికారులకు తెలియజేస్తుండాలని పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు 26,27,28 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

శిక్షణకు సకాలంలో హాజరుకాని ఉద్యోగి సస్పెన్షన్

రాయగిరిలోని విద్యాజ్యోతి హైస్కూల్‌లో ప్రిసైడింగ్, అసిసెంట్ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు సకాలంలో హాజరుకాని ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ డీఈఓ నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 9 గంటలకు శిక్షణ తరగుతుల ప్రారంభం కాగా బీబీనగర్ మండలం వెంకిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన స్కూల్ అసిస్టెంట్ జి.గాయత్రి 2 గంటలు ఆలస్యంగా వచ్చారు. ఆలస్యానికి కారణం అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భువనగిరి, ఆలేరులో ఐటీ హబ్‌లు



భువనగిరిలో జరిగిన రోడ్ షోలో తల్వార్ ఎత్తిన మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి



బొమ్మలరామారం మండలం చీకటిమామిడిలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో అభ్యర్థి సునీత, భిక్షమయ్యగౌడ్

- స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తాం
- పైళ్ల శేఖర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉండడం భువనగిరి ప్రజల అదృష్టం
- గొంగిడి సునీతను గెలిపిస్తే ఆలేరు నియోజకవర్గం మరింత అభివృద్ధి
- భువనగిరి, చీకటిమామిడిలో మంత్రి హరీశ్‌రావు

భువనగిరి, బొమ్మలరామారం : భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో ఐటీ హబ్‌లు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హామీ ఇచ్చారు. శనివారం భువనగిరి, బొమ్మలరామారం మండలం చీకటిమామిడిలో బీఆర్‌ఎస్ అభ్యర్థులు పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీతకు మద్దతుగా రోడ్ షో, కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పైళ్ల శేఖర్‌రెడ్డిది చీమకు కూడా హాని తలపెట్టని వ్యక్తిత్వమని, అలాంటి వ్యక్తి ఎమ్మెల్యేగా ఉండడం భువనగిరి నియోజకవర్గ ప్రజల అదృష్టమన్నారు. భువనగిరి నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న వ్యక్తి బీఆర్‌ఎస్‌లోకి ఎందుకు వచ్చారో, ఎందుకు వెళ్లారో, రేపు ఏ పార్టీలో ఉంటారో.. ఆయనకే తెలియదన్నారు. హేమాహేమీలు ఉన్న ఈ జిల్లాలో ఆయన వెనుకబెంచీలో కూర్చోవల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. భువనగిరి మున్సిపల్ చైర్మన్ కోరిక మేరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తే భువనగిరిలో చిన్న పిల్లల ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే భువనగిరి నియోజవర్గాన్ని సిద్దిపేట తరహాలో అభివృద్ధి చేసేందుకు సహకరించాలని మంత్రిని కోరారు.

కాంగ్రెస్ వస్తే ఆరు నెలలకో సీఎం గ్యారంటీ..

గొంగిడి సునీతను మూడవసారి భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. సునీతను గెలిపిస్తే చీకటిమామిడి చౌరస్తా నుంచి వడపర్తి వరకు డబుల్ రోడ్డు వేస్తామన్నారు. సునీత విజ్ఞప్తి మేరకు ఆలేరు నియోజకవర్గానికి మెడికల్ కళాశాల మంజూరు చేశామని చెప్పారు. నియోజకవర్గంలో ఒకప్పుడు తాగునీటి ఎద్దడి ఉండేదని, సీఎం కేసీఆర్ చలువతో గోదావరి జలాలు వచ్చి వేసవిలో సైతం చెరువులు మత్తడి దూకుతున్నాయన్నారు. సుభిక్షంగా ఉన్న తెలంగాణను కాంగ్రెస్ చేతిలో పెడితే కుక్కలు చింపిన విస్తరిలా తయారవుతుందన్నారు. 24 గంటల కరెంట్ కావాలో.. మూడు గంటల కరెంట్ చాలంటున్న కాంగ్రెస్ కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ స్కీంల సంగతేమో కానీ.. ఆరు నెలలకు ఒక్క సీఎం మారడం గ్యారెంటీ అని ఎద్దేవా చేశారు. 80 సీట్లతో మరోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో మంత్రి దయాకర్‌రావు, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకుడు చింతల వెకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అమరేందర్, రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ అమరేందర్, మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, వైస్ చైర్మన్ కిష్టయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేందర్, పీఏసీఎస్ చైర్మన్ పరమేశ్వర్‌రెడ్డి, హరిశంకర్‌గౌడ్, కల్లూరి రామచంద్రారెడ్డి, ఎంపీపీ సుధీర్‌రెడ్డి, మచ్చ శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ బాల్ నర్సింహ, వైస్ ఎంపీపీ శోభ చంద్రమౌళి, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, సర్పంచ్ పాల్గొన్నారు.

శేఖర్‌రెడ్డి గెలిస్తే ప్రమోషన్

సాక్షి, యాదాద్రి : పైళ్ల శేఖర్‌రెడ్డి మూడవసారి గెలిస్తే ప్రమోషన్ వస్తుందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. శనివారం రాత్రి భువనగిరిలో జరిగిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు. పైళ్ల శేఖర్‌రెడ్డి మంచి మనిషని, ఎక్కడో వ్యాపారం చేసి ప్రజల కోసం సొంత డబ్బు ఖర్చు చేస్తున్నాడని కొనియాడారు. శేఖర్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం నియోజకవర్గ ప్రజలందరికీ దక్కే గౌరవంగా అభివర్ణించారు. శేఖర్‌రెడ్డికి, కార్యకర్తల కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని మంత్రి స్పష్టం చేశారు. శేఖర్‌రెడ్డి దమ్మున్న నాయకుడని మంత్రి దయాకర్‌రావు అన్నారు.

విజయ సంకల్ప సభ


హుజూర్‌నగర్‌లో నిర్వహించిన విజయ సంకల్ప సభలో అభివాదం చేస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, చిత్రంలో హుజూర్‌నగర్ బీజేపీ అభ్యర్థి చల్లా శ్రీలతారెడ్డి, కోదాడ జనసేన అభ్యర్థి మేకల సతీష్‌రెడ్డి


జేపీ నడ్డాకు నమస్కరిస్తున్న హుజూర్‌నగర్ బీజేపీ అభ్యర్థి చల్లా శ్రీలతారెడ్డి, చిత్రంలో కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్

• బీఆర్‌ఎస్ జోష్


బొమ్మలరామారం మండలం చీకటిమామిడిలో మంత్రి హరీశ్‌రావు కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు


చీకటిమామిడి కార్నర్ మీటింగ్‌లో గులాబీ కండువాలు ఊపుతున్న బూడిద భిక్షమయ్య తదితరులు


చీకటిమామిడి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి


భువనగిరి పట్టణంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు హాజరైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ప్రజలు

అమిత్‌షా రోడ్ షో కొనసాగిందిలా..


చౌటుప్పల్‌లో నిర్వహించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రోడ్ షో సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ కార్యకర్తలు


అభివాదం చేస్తున్న అమిత్ షా, చిత్రంలో మునుగోడు అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి, బూర నర్సయ్యగౌడ్, గంగిడి మనోహర్‌రెడ్డి

చౌటుప్పల్: మునుగోడు బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డికి మద్దతుగా చౌటుప్పల్ పట్టణంలో శనివారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రోడ్ షో నిర్వహించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లిలో గల ముస్కు మధుసూదన్‌రెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు మధ్యాహ్నం 2.20 గంటలకు అమిత్ షా చేరుకున్నారు. ఆయనకు భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, మునుగోడు బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి తదితర నాయకులు స్వాగతం పలికారు. అనంతరం అమిత్ షా ప్రచార రథం పైకి ఎక్కి రోడ్ షో ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలతో కలిసి తంగడపల్లి, తంగడపల్లి రోడ్డు, జాతీయ రహదారి, బస్టాండ్ జంక్షన్ నుంచి చిన్నకొండూర్ చౌరస్తా వరకు రోడ్‌షో కొనసాగింది. ప్రచార రథంపై నుంచి అమిత్ షా అభివాదం చేస్తూ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు. భారత్ మాతాకీ జై, జైశ్రీరాం అంటూ ఆయన స్వయంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనూరి వీరారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు, బీజేపీ మండల, మున్సిపల్ అధ్యక్షులు రిక్కల సుధాకర్‌రెడ్డి, ఊడుగు వెంకటేశం, సర్పంచ్‌లు కాయితి రమేష్, బాతరాజు సత్యం, నాయకులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, మునగాల తిరుపతిరెడ్డి, ఆలె చిరంజీవి, శాగ చంద్రశేఖర్‌రెడ్డి, దాసోజు భిక్షమాచారి, పాలకూర్ల జంగయ్య, ఊడుగు యాదయ్య, రమనగోని దీపిక, కడారి కల్పన, కైరంకొండ అశోక్, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను అడ్డుకున్న వారిపై కేసు

నడిగూడెం : పోస్టల్ బ్యాలెట్‌ను అడ్డుకున్న వారిపై శనివారం నడిగూడెం పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. నడిగూడెం మండల కేంద్రంలో ఈ నెల 23న పోస్టల్ బ్యాలెట్ ద్వారా పలువురు ఓటు వేస్తున్నప్పుడు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అడ్డుకున్నారు. దీంతో ఈ నెల 24న తహసీల్దారు హేమామాలిని పోలీసులకు ఫిర్యాదు చేయగా శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపారు.

తాయిలాలకు అంగీకరించినా నేరమే..

భువనగిరి: ఎన్నికల సమయంలో పలువురు అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించేందుకు మద్యం, నగదు, క్రీడా సామగ్రి వంటివి ఇస్తూ ప్రలోభాలకు గురిచేస్తుంటారు. అభ్యర్థులు వీటిని పంచుతూ పట్టుబడితే కేసు నమోదు చేస్తారు. అయితే వాటిని తీసుకున్నా.. లేదా తీసుకోవడానికి అంగీకరించినా ప్రజా ప్రాతినిధ్య చట్టం–1951(సెక్షన్–123) ప్రకారం నేరమే అవుతుంది. తాయిలాలు తీసుకుంటూ దొరికితే జైలు శిక్ష లేదా జరిమానా లేదంటే రెండూ కలిపి విధించే అవకాశం ఉంది.

నేడు భువనగిరికి సీతారాం ఏచూరి రాక

భువనగిరిటౌన్: భువనగిరి, మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల సీపీఎం అభ్యర్థుల తరఫున ప్రచారం చేసేందుకు గాను ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు భువనగిరిలో రోడ్ షో నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రోడ్ షోకు సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. రోడ్ షోకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అమిత్‌షా సభను జయప్రదం చేయాలి

సాక్షి యాదాద్రి: కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు బీజేపీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని భువనగిరి బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయగిరి వద్ద సభా ఏర్పాట్లను జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావుతో కలిసి ఆయన పరిశీలించారు. అధికారులు, పార్టీ నాయకులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ మధ్యాహ్నం 2గంటలకు సభ ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. ఈ సభకు 50 వేల మందిని తరలించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. తనతో పాటు ఆలేరు నియోజకవర్గ అభ్యర్థి పడాల శ్రీనివాస్ సభలో పాల్గొంటారని తెలిపారు. సభా వేదిక పక్కనే హెలిపాడ్ ఏర్పాటు చేశారు. సభా ప్రాంగణాన్ని ఎస్‌పీజీ, కేంద్ర భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి.


సభ నిర్వహించే స్థలంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న గూడూరు నారాయణరెడ్డి తదితరులు

ఎన్నికల సిత్రాలు

• పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా..


చిలుకూరు: సైకిల్‌పై మొక్కలు పెట్టుకొని ప్రచారం చేస్తున్న పర్యావరణవేత్త, కోదాడ స్వతంత్ర అభ్యర్థి కొల్లు లక్ష్మీనారాయణ

• ఓటరు మనసు 'దోసే'స్తా..


యాదగిరిగుట్ట: ప్రచారంలో భాగంగా యాదగిరిగుట్టలో దోశలు వేస్తున్న ఆలేరు కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల అయిలయ్య

అదుపుతప్పి పెళ్లి బృందం బస్సు బోల్తా

• పెళ్లి కుమారుడి నాయనమ్మ మృతి.. 16మందికి గాయాలు
• క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమం
• డ్రైవర్ నిద్రమత్తే ప్రమాదానికి కారణం
• చింతపల్లి మండల కేంద్రంలో విషాదం


భారతమ్మ (ఫైల్)

చింతపల్లి : నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున పెళ్లి బృందం బస్సు అదుపుతప్పి బోల్తాకొట్టడంతో పెళ్లికుమారుడి నాయనమ్మ మృతిచెందగా మరో 16మందికి గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. హైదరాబాద్‌లోని హయత్‌నగర్ పరిధి కుంట్లూరుకు చెందిన హరీష్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన అనూషారెడ్డితో ఈ నెల 24న అక్కడే వివాహం జరిగింది. వేడుకలో పాల్గొనేందుకు హరీష్‌రెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు 40మంది శుక్రవారం హైదరాబాద్ నుంచి ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో వినుకొండకు బయల్దేరారు. అదేరోజు మధ్యాహ్నం వేడుక ముగిసిన తర్వాత పెళ్లి బృందం సభ్యులు సరదాగా గడిపారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత హైదరాబాద్‌కు బస్సులో తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో చింతపల్లిలోని సాయిబాబా దేవాలయం సమీపంలోకి రాగానే డ్రైవర్ గఫూర్ నిద్రమత్తుతో బస్సు అదుపుతప్పింది. ఈ క్రమంలో బస్సు ఒక్కసారిగా రోడ్డుకు ఎడమవైపునకు దూసుకెళ్తున్న క్రమంలో పెళ్లి బృందం సభ్యులు కేకలు వేశారు. దీంతో డ్రైవర్ తేరుకుని బస్సును కుడివైపు తిప్పి రోడ్డు ఎక్కించే క్రమంలో వేగ నియంత్రణ లేక బోల్తా కొట్టింది. ప్రమాదంలో పెళ్లి కుమారుడి నాయనమ్మ సప్పిడి భారతమ్మ(64) అక్కడికక్కడే మృతిచెందగా బంధువులు వసంత, నరేందర్‌రెడ్డి, కతిక్‌రెడ్డి, సునంద, ప్రణవి, నిర్మల, శ్రేయారెడ్డి, పద్మ, శ్రీహిత, హర్షిత, శ్యామ్‌సుందర్‌రెడ్డి, చైతన్య, ప్రవీణ, నర్సింహారెడ్డిలకు స్వల్ప, లింగమ్మ, వెంకటనర్సింహారెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో గాయపడి ఆహాకారాలు చేస్తున్న క్షతగాత్రులను స్థానికులు ప్రైవేట్ అంబులెన్స్, 108 వాహనాల్లో స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రోడ్డుకు అడ్డంగా బస్సు పడిపోవడంతో గంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పోలీసులు జేసీబీల సహాయంతో బస్సును పక్కకు తీయించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. తీవ్రంగా గాయపడిన లింగమ్మ, వెంకటనర్సింహారెడ్డిల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మృతురాలి కుమారుడు సప్పిడి వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.


ప్రమాద స్థలం వద్ద గుమిగూడిన జనం


బోల్తా పడిన బస్సును రోడ్డు పక్కకు జరుపుతున్న జేసీబీ

చౌటబావి గ్రామంలో విషాదం

నార్కట్‌పల్లి : చింతపల్లి మండల కేంద్రంలో పెళ్లి బృందం బస్సు అదుపుతప్పి బోల్తా కొట్టిన ప్రమాదంలో పెళ్లికుమారుడి నాయనమ్మ సప్పిడి భారతమ్మ(64) మృతిచెందడంతో ఆమె స్వగ్రామం నార్కట్‌పల్లి మండలం చౌటబావి గ్రామంలో విషాదం అలుముకుంది. చౌటబావి గ్రామానికి చెందిన సేనయ్యరెడ్డి, భారతమ్మ దంపతులకు ఇద్దరు కుమారుడు, కుమార్తె సంతానం. అందరికీ వివాహాలు జరిపించారు. పిల్లల కుటుంబాలు హైదరాబాద్‌లో స్థిరపడగా వృద్ధ దంపతులు స్వగ్రామంలోనే ఉంటూ అప్పుడప్పుడు హైదరాబాద్‌కు వెళ్లి వస్తుంటారు. గుంటూరు జిల్లా వినుకొండలో జరిగిన సేనయ్యరెడ్డి సోదరుడి మనువడు హరీష్‌రెడ్డి వివాహానికి వెళ్లి వస్తుండగా జరిగిన ప్రమాదంలో భారతమ్మ మృతిచెందింది. భారతమ్మ అంత్యక్రియలు హైదరాబాద్‌లోనే నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

ప్రజాకోర్టులో కాంగ్రెస్‌కు భంగపాటు తప్పదు

• ఈడీ, ఐటీ దాడులపై రేవంత్ బహిరంగ లేఖ హాస్యాస్పదం
• రైతు బంధుపై ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు హర్షణీయం
• సూర్యాపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి జగదీశ్‌రెడ్డి


సూర్యాపేట మండలం కేటీ అన్నారంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట రూరల్ : ప్రజా కోర్టులో మరోసారి కాంగ్రెస్ పార్టీకి భంగపాటు తప్పదని సూర్యాపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట మండలం కేటీ అన్నారం గ్రామంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీజేపీలు కలిసి కుట్రపూరితంగా ఐటీ, ఈడీ దాడులు చేయిస్తున్నాయని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ రాయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గోబెల్స్ ప్రచారానికి సిద్ధహస్తుడైన రేవంత్‌కు బీఆర్‌ఎస్ నాయకులపై జరుగుతున్న ఐటీ ,ఈడీ దాడులు కనపడటం లేదా అని ప్రశ్నించారు. రేవంత్ అబద్ధాలు ఆడుతూ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. బీఆర్‌ఎస్‌కు రోజురోజుకీ ప్రజల్లో ఆదరణ పెరుగుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా 24గంటల విద్యుత్ సరఫరా కావడం లేదన్నారు. ఎన్నికల కమిషన్‌ను అడ్డు పెట్టి రైతు బంధుని అడ్డుకునే కుట్ర పన్నారని ఆరోపించారు. కానీ, రైతు బంధు అమలు చేయాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు ఇవ్వడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌ను 12 సీట్లలో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ రేవంత్‌రెడ్డి

• ఆలేరు బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న గొంగిడి సునీత

గుండాల : ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ రేవంత్‌రెడ్డి అని, ఆయనకు తమ గురించి మాట్లాడే అర్హత లేదని, దమ్ముంటే భూకబ్జాలకు పాల్పడినట్లు నిరూపించాలని ఆలేరు బీఆర్‌ఎస్ అభ్యర్థి గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి సవాల్ విసిరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన యాదవుల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొని మాట్లాడారు. యాదగిరిగుట్ట చుట్టూ భూకబ్జాలకు పాల్పడ్డామని ఆరోపించిన రేవంత్‌రెడ్డి తడిబట్టలతో లక్ష్మీనర్సింహాస్వామి గుడిలో ప్రమాణం చేద్దామా.. అని ఒక ఆడబిడ్డగా సవాల్ చేస్తున్నానన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులకు బీఫాంలు అమ్ముకున్న చరిత్ర నీదని, పీసీసీ పదవిని డబ్బులిచ్చి కొన్న నువ్వు మాపై నిందలు వేయడం సరైంది కాదన్నారు. రియల్ ఎస్టేట్ ముసుగులో హత్యలు చేయించిన చరిత్ర రేవంత్‌రెడ్డిదని, కోకాపేటలో 200ఎకరాల భూమిని కబ్జా చేసిన రేవంత్‌రెడ్డి జాగ్రత్తగా మాట్లాడాలన్నారు. రైతులను బిక్షగాళ్లుగా పోల్చిన రేవంత్‌రెడ్డిని తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకార్లను తరిమినట్లుగా తరమాలని పిలుపునిచ్చారు. అనంతరం రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ మాట్లాడారు. రాష్ట్రంలో 7లక్షల కుటుంబాలకు గొర్రెల పంపిణీ చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు బొంగు శ్రీశైలం, సంగి బాలకృష్ణ, మాజీ ప్రజాప్రతినిధులు సంగి వేణుగోపాల్, పురుగుల మల్లయ్య, పురుగుల యాదలక్ష్మి, తొట్ల స్వామి, వెంకటేష్, రమేష్, శ్రీనివాస్, రాంమల్లు, భిక్షమయ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తండాల రూపురేఖలు మార్చిన ఘనత బీఆర్‌ఎస్‌దే

• మునుగోడు బీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి



వాచ్యాతండాలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం : గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా చేసి తండాల రూపురేఖలు మార్చిన ఘనత బీఆర్‌ఎస్‌దేనని మునుగోడు బీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రాచకొండ, కడీలబావి, తుంబాయి, మొల్కచెర్వు, గంగమూల, వాచ్యాతండా, కడపగండి, బోటిమీదితండా, గుడిమల్కాపురం, మహ్మదాబాద్ తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. పూటకో పార్టీ మారి డబ్బు అహంకారంతో రాజకీయాలు చేసే రాజగోపాల్‌రెడ్డికి తగిన బుద్ధిచెప్పాలన్నారు. ఉపఎన్నిక తర్వాత సంవత్సరకాలంలో రూ.600కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు. రాజ గోపాల్‌రెడ్డికి ఓటు వేసి మళ్లీ మోసపోవద్దన్నారు. కార్యక్రమాల్లో పాల్వాయి స్రవంతి, పార్టీ మండల అధ్యక్షుడు కత్తుల లక్ష్మయ్య నాయకులు తదితరులున్నారు.

వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరికలు

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని 13వ వార్డుకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు శనివారం మునుగోడు బీఆర్‌ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుల్తాన్ రాజు, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు తొర్పునూరి నర్సింహ, నాయకులు దేవరపల్లి గోవర్ధన్‌రెడ్డి, పాశం సంజయ్‌బాబు, మల్లేష్, వెంకటేష్, మహేష్, అంజయ్య, సాయి పాల్గొన్నారు.

వైభవంగా మత్స్యగిరీశుడి కల్యాణం



తాళి బొట్టు చూపిస్తున్న వేద పండితులు

వలిగొండ : మండలంలోని వెంకటాపురంలో గల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారి కల్యాణం శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాద రామానుజస్వామి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేంద్రకుమార్ దంపతులు, ఆలయ కార్యనిర్వాహణ అధికారి మోహన్‌బాబు సమర్పించారు. కల్యాణం అనంతరం హైదరాబాద్‌కు చెందిన జంపాల రాంబాబు సౌజన్యంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు రాపోలు ఆనందభాస్కర్, ఎంపీపీ నూతి రమేష్, సర్పంచ్ కొత్త నర్సింహ, ఎంపీటీసీ సామ రాంరెడ్డి, అనంతరెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం రవాణా, అమ్మకాలపై కేసులు నమోదు

భువనగిరి క్రైం : ఎన్నికల కోడ్ అమలులో భాగంగా అక్రమ మద్యం రవాణాపై అధికారులు ప్రత్యేక నిఘా పెంచారు. శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన దాడుల్లో మద్యం అమ్మకాలు, నిల్వ, రవాణా చేస్తున్న ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ జిల్లా అధికారి కె.నవీన్ కుమార్ వెల్లడించారు. పట్టుబడిన వారి నుంచి 736.50లీటర్ల మద్యంతో పాటు, రెండు అశోక్ లేలాండ్ వాహనాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. పట్టుబడిన మద్యం విలువ రూ.9,94,772 ఉంటుందని తెలిపారు. ఈ దాడుల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ బి.రాధాకృష్ణ, ఎక్సైజ్ సీఐ బి.నాగిరెడ్డి, ఎస్‌ఐలు జి.నాగరాజు, వివేక్, సాయికిరణ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గౌడ కులస్తులు బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలి


సమావేశంలో మాట్లాడుతున్న చెరుకు సుధాకర్, బూడిద భిక్షమయ్య

చౌటుప్పల్ : గౌడ కులస్తులంతా బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, సీనియర్ నాయకుడు చెరుకు సుధాకర్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా చేయని విధంగా గీత వృత్తి సంక్షేమానికి, గౌడ కులస్తుల మేలు కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. గతంలో కాంట్రాక్టు కోసం బీజేపీలోకి వెళ్లిన రాజగోపాల్‌రెడ్డి ప్రస్తుతం కర్నాటకలో కాంట్రాక్టు పొంది తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చాడని ఆరోపించారు. కోమటిరెడ్డి సోదరులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయంగా ఇతరులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గిర్కటి నిరంజన్, మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ ఊడుగు మల్లేష్, నాయకులు అనంతరాజు, ఊడుగు శ్రీనివాస్, బొంగు జంగయ్య, ముప్పిడి శ్రీనివాస్, సుర్వి మల్లేష్, ఊడుగు రమేష్, కొయ్యడ శేఖర్, వర్కాల రవి, శ్రీధర్, బాలరాజు, మార్కండేయ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.